# సాక్షి కుమురం భీం

బుధవారం ၊ 10 ၊ మే ၊ 2023


## పరీక్ష ఫలితమే.. జీవితం కాదు



జీవితం అంటే చదువులు, మార్కులు, ర్యాంకులు, ఉద్యోగాలు మాత్రమే కాదు. పరీక్షల్లో ఫెయిల్ అయితే జీవితంలో ఓడిపోయినట్లు కాదు.

8లో▸



## ఆర్టీసీకి సీజన్ జోష్

శుభకార్యాల సీజన్ ఆర్టీసీకి కలిసివస్తోంది. బస్సుల్లో వారం రోజులుగా ప్రయాణికుల శాతం ఆక్యుపెన్సి రేషియో (ఓఆర్) పెరిగింది.

10లో▸




## వాతావరణం

ఆకాశం కొంత మేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్అర్బన్:** జిల్లాలో టాస్క్‌డెస్క్ ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి విడత శిక్షణలో భాగంగా ఫస్ట్ బ్యాచ్ కంప్యూటర్ శిక్షణను పూర్తి చేసుకుందని తెలిపారు. ఈ నెల 15 నుంచి రెండో బ్యాచ్‌కు అప్టిట్యూడ్, రీజనింగ్ అంశాలపై శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 79938 5959 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**ఆసిఫాబాద్‌రూరల్:** జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో పార్ట్‌టైం గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దివ్యారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ సెట్, నెట్, పీహెచ్‌డీ అర్హతతోపాటు రెండేళ్ల బోధన అనుభవం కలిగిన అభ్యర్థులు ఈ నెల 16 లోగా https://www.ttwrdcs.ac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యవర్గం ఎన్నిక

**కాగజ్‌నగర్‌టౌన్:** కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో సోమవారం నిర్వహించిన ప్లీనరీ ముగింపు సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులుగా సతీశ్, ఉపాధ్యక్షులుగా మీసారి చిరంజీవి, ఎండీ జాఫర్, వి.సాయికుమార్, జిల్లా కార్యదర్శిగా తుమ్మిడే భీమేశ్, జిల్లా సహాయ కార్యదర్శులుగా డోకే నవీన్, సుంకరి సాయికృష్ణ, సభ్యులుగా డి.ప్రకాశ్, దేవిశ్రీ ప్రసాద్, కె.సాయిరాం, ఎస్.నితీష్ శైలజ, రాంచందర్, రాజేందర్, ఎస్.నవీన్‌ను ఎన్నుకున్నారు.

### 'శాలసిద్ధి' శిబిరంలో జిల్లా కోఆర్డినేటర్లు



శిక్షణలో పాల్గొన్న జిల్లా కోఆర్డినేటర్లు

**ఆసిఫాబాద్:** హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన శాలసిద్ధి శిక్షణ శిబిరంలో జిల్లాకు చెందిన కోఆర్డినేటర్లు సుభాష్, భరత్, సత్యనారాయణ మూర్తి, సత్తయ్య, శ్రీనివాస్, భిక్షపతి పాల్గొన్నారు. బోధన అభ్యాసన, ముదింపు, విద్యార్థుల ప్రగతి సాధనతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించినట్లు వారు తెలిపారు. త్వరలో జిల్లాలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

### విధుల్లో చేరిన నలుగురు కార్యదర్శులు

**ఆసిఫాబాద్:** సమ్మె బాట పట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో మంగళవారం జిల్లాలో నలుగురు కార్యదర్శులు విధుల్లో చేరారు. వాంకిడి మండలంలో ఒక జూనియర్ పంచాయతీ కార్యదర్శి, కాగజ్‌నగర్ మండలంలో ఇద్దరు, బెజ్జూర్ మండలంలో ఒకరు ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరినట్లు ఇన్‌చార్జి డీపీవో సురేందర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటల్లోగా విధుల్లో చేరని వారిని తొలగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

### 'ప్రజలు మార్పు కోరుకుంటున్నారు'



పాదయాత్ర చేస్తున్న హరీశ్‌బాబు

**బెజ్జూర్(సిర్పూర్):** ప్రజలు వ్యవస్థలో మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పును భారతీయ జనతా పార్టీ తీసుకువస్తుందని ఆ పార్టీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. పల్లెపల్లెకు పాల్వాయి– గడపగడపకు బీజేపీ పాదయాత్రలో భాగంగా మంగళవారం బెజ్జూర్ మండలంలోని బారెగూడలో పర్యటించారు. గ్రామంలో పాదయాత్ర నిర్వహించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ముంజంపల్లి, బారెగూడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన బీజేపీ జెండాలను ఆవిష్కరించారు.

# అ'ద్వితీయం'

- 4,000 మంది విద్యార్థులకు 3,249 మంది ఉత్తీర్ణత
- వృత్తి విద్యా కోర్సుల్లో 544 మంది ఉత్తీర్ణత
- గతేడాది కన్నా 4 శాతం ఉత్తీర్ణత పెరుగుదల
- ఫస్టియర్‌లో మూడోస్థానంలో జిల్లా
- ఫలితాల్లో బాలికలదే పైచేయి



డీఐఈవో శ్రీధర్‌సుమన్‌కు స్వీట్లు తినిపిస్తున్న అధ్యాపకులు

**సాక్షి, ఆసిఫాబాద్:** ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం వెలువడిన ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంత్సరం పరీక్షల ఫలితాల్లో వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్రస్థాయిలో 81 శాతం ఉత్తీర్ణతతో కుమురంభీం జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. అన్ని విభాగాల్లో బాలికలే పైచేయి సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 4,000 మంది హాజరు కాగా 3,249 మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత 4 శాతం పెరిగింది. అలాగే ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 4,371 మంది విద్యార్థులు హాజరు కాగా 74 శాతం ఉత్తీర్ణతతో 3,227 మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచారు. రెండో ఏడాది వృత్తి విద్యా కోర్సు పరీక్షల్లో సైతం జిల్లా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. 697 మందికి 544 మంది ఉత్తీర్ణత (78 శాతం) సాధించారు. తొలి ఏడాదిలోనూ 766 మంది విదార్థులు పరీక్షలకు హాజరు కాగా 521 మంది(68 శాతం) ఉత్తీర్ణత సాధించారు. జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో పలువురు అధ్యాపకులు డీఐఈవో శ్రీధర్‌సుమన్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వీట్లు తినిపించారు. జిల్లా రెండో స్థానంతో నిలవడంపై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను డీఐఈవో అభినందించారు.

**వందశాతం ఫలితాలు**

జిల్లాలో నాలుగు ప్రభుత్వ కళాశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. కాగజ్‌నగర్ గన్నారంలోని మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే కళాశాలలో 65 విదార్థులకు గాను 65 మంది పాసయ్యారు. దహెగాం, చింతలమానెపల్లి కేజీబీవీ విద్యార్థులు సైతం వందశాతం ఉత్తీర్ణత సాధించారు. కెరమెరి మండలంలోని మోడి కేజీబీవీ ఫస్టియర్‌లో 33 మందికి 33 మంది ఉత్తీర్ణత సాధించారు. కాగజ్‌నగర్ బలగలలో ఉన్న తెలంగాణ మైనార్టీ బాలుర గురుకులం కళాశాల్లో 34 మందికి 34 మంది ఉత్తీర్ణత సాధించి భేష్ అనిపించుకున్నారు.

**ప్రభుత్వ కళాశాలల టాపర్లు వీరే..**

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచారు. ఎంజేపీ కళాశాల విద్యార్థిని దీపిక బిశ్వాస్ బైపీసీలో 1000 మార్కులకు 985 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. ఇక ఆసిఫాబాద్ మోడల్ స్కూల్ విద్యార్థి యశశ్రీ కూడా 976(ఎంపీసీ) మార్కులతో రెండో స్థానంలో సాధించింది. జైనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పెందూర్ రాజు 973 మార్కులతో మూడో స్థానం సాధించారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్‌కు చెందిన పవన్ కల్యాణ్ 969 మార్కులతో తర్వాతి స్థానంలో ఉన్నారు. ఎంఈసీలో తెలంగాణ మోడల్ స్కూల్ (ఆసిఫాబాద్) విద్యార్థిని సమీరా శిరీషా 974 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచింది. మొదటి సంవత్సరంలో దహెగాం కేజీబీవీ విద్యార్థి అల్లం శైలజ ఎంపీసీలో 470 మార్కులకు 464 మార్కులు, ఆసిఫాబాద్ తెలంగాణ మోడల్ స్కూల్ ఎంపీసీ విద్యార్థిని వి.పూజిత 463 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చారు.

### కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

**ఆసిఫాబాద్:** కేజీబీవీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరంలో 367 మందికి 356 మంది(97 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో 470 మందికి 411 మంది(87.45 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ విభాగంలో ఈ.వర్షిత 965, బైపీసీలో రమాదేవి 980, సీఈసీలో నాగేశ్వరి 899 టాపర్లుగా నిలిచారు. మొదటి సంవంత్సరంలో ఎంపీసీలో అల్లం శైలజ 464, బైపీసీలో స్వాతి 427, సీఈసీలో నాగమణి 454, ఎంపీహెచ్‌డబ్ల్యూలో సుకన్య 482 మార్కులు సాధించింది.

### రైతు బిడ్డకు ర్యాంకు



పూజిత

**ఆసిఫాబాద్‌రూరల్:** జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఫస్టియర్ చదువుతున్న ఒజ్జెల పూజిత ఎంపీసీలో 463 మార్కులు సాధించింది. బెజ్జూర్ మండలం సలుగుపల్లికి చెందిన ఒజ్జెల రాజన్న, రత్నమాల దంపతులది వ్యవసాయ కుటుంబం. రైతు కుటుంబం నుంచి పూజిత ఉత్తమ మార్కులతో జిల్లా స్థాయి ర్యాంకు సాధించింది.

### మొదటి సంవత్సరం

| | | |
|---|---|---|
| బాలురు | ఉత్తీర్ణులు | శాతం |
| 2,066 | 1,407 | 68 |
| బాలికలు | ఉత్తీర్ణులు | శాతం |
| 2,305 | 1,820 | 78 |
| **వృత్తి విద్య కోర్సు** | | |
| బాలురు | ఉత్తీర్ణులు | శాతం |
| 372 | 215 | 57 |
| బాలికలు | ఉత్తీర్ణులు | శాతం |
| 394 | 306 | 77 |

### రెండో సంవత్సరం

| | | |
|---|---|---|
| బాలురు | ఉత్తీర్ణులు | శాతం |
| 1,842 | 1,389 | 75 |
| బాలికలు | ఉత్తీర్ణులు | శాతం |
| 2158 | 1,860 | 86 |
| **వృత్తి విద్య కోర్సు** | | |
| బాలురు | ఉత్తీర్ణులు | శాతం |
| 360 | 263 | 73 |
| బాలికలు | ఉత్తీర్ణులు | శాతం |
| 337 | 281 | 83 |

### రెండో సంవత్సరం ప్రైవేటు

| | | |
|---|---|---|
| బాలురు | ఉత్తీర్ణులు | శాతం |
| 53 | 33 | 62 |
| బాలికలు | ఉత్తీర్ణులు | శాతం |
| 36 | 17 | 47 |
| **వృత్తి విద్య కోర్సు...** | | |
| బాలురు | ఉత్తీర్ణులు | శాతం |
| 17 | 11 | 64 |
| బాలికలు | ఉత్తీర్ణులు | శాతం |
| 02 | 02 | 100 |

### సంతోషంగా ఉంది

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవడం చాలా సంతోషంగా ఉంది. ఉపాధ్యాయులు, పేరెంట్స్ సహకారంతో ప్రణాళికతో చదువుకుని మంచి మార్కులు సాధించా. భవిష్యత్తులో డాక్టర్ కావాలని ఉంది.

– దీపికా బిశ్వాస్, జిల్లా ఫస్ట్ ర్యాంకర్

### మెరిసిన పేదింటి ఆణిముత్యం



శైలజను అభినందిస్తున్న ఎస్‌వో

**దహెగాం:** వ్యవసాయ కుటుంబంలో పుట్టిన అల్లం శైలజ అనే విద్యార్థి ఇంటర్ ఫలితాల్లో మెరిసింది. ఎంపీసీలో 464 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. కాగజ్‌నగర్ మండలం బోడపల్లి గ్రామానికి చెందిన అల్లం మల్లేశ్, నిర్మల దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు. మల్లేశ్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండో సంతానమైన శైలజ పదో తరగతి ఇట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్తి చేసింది. ఇంటర్ కోసం దహెగాం కేజీబీవీలో చేరింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 464 మార్కులతో ప్రతిభ చూపింది. ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు 'సాక్షి'తో మాట్లాడుతూ ఎంపీసీ ఫస్టియర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన శైలజను అభినందిస్తున్నామన్నారు.

### ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా..

పేద కుటుంబమైనా అమ్మానాన్న వ్యవసాయం చేస్తూ చదివిస్తున్నారు. ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా. టీచర్లు ఎంతో ప్రోత్సహించారు. చాలా సంతోషంగా ఉంది.

– అల్లం శైలజ



ఏ.యశశ్రీ, ఎంపీసీ



కోట సుప్రియ, బైపీసీ



ఈ.నవిత, సీఈసీ



ప్రవీణ్ మహేందర్, ఎంపీసీ



కె.రమాదేవి, బైపీసీ



డి.అనూష, ఎంపీసీ



బిందు, బైపీసీ



ఏ.శైలజ, ఎంపీసీ

## ఆధార్ అనుసంధానం తప్పనిసరి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

**ఆసిఫాబాద్అర్బన్:** ప్రతీ ఖాతాదారు బ్యాంకు ఖాతాకు ఆధార్, మొబైల్ నంబర్ అనుసంధానం చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి జిల్లా గ్రామీణాభివృద్ధి, సంక్షేమ, పరిశ్రమల శాఖలు, బ్యాంకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ నంబర్, మొబైల్ అనుసంధానం చేసుకునే విధంగా ఖాతాదారులకు అవగాహన కల్పించాలన్నారు. గత వార్షిక సంవత్సరం రుణ నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. వ్యవసాయ, స్వయం సహాయక సంఘాలు, కార్పొరేషన్ రుణ లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు మంజూరు చేసిన యూనిట్లు, గేదెల కోసం అందిన దరఖాస్తులను పరిశీలించాలన్నారు. పంట రుణాలు సకాలంలో మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ శాఖల రుణాలపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హనుమంత్‌రావు, బ్యాంకుల మేనేజర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జేపీఎస్‌ల సమ్మెకు కేంద్ర మంత్రి మద్దతు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రూపాల

**ఆసిఫాబాద్అర్బన్:** జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు కేంద్రం మంత్రి పరుషోత్తం రూపాల సంపూర్ణ మద్దతు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద జేపీఎస్‌ల సమ్మె శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బెదిరించే ప్రకటనలకు వెనుకడుగు వేయకుండా సర్వీసు క్రమబద్ధీకరించే వరకూ పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## స్విమ్మింగ్ పూల్ పునఃప్రారంభం

**రెబ్బెన(ఆసిఫాబాద్):** సింగరేణి ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని గోలేటిలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌ను పునఃప్రారంభించారు. స్విమ్మింగ్‌పూల్‌ను సింగరేణి ఉద్యోగులు, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు అన్నారు. మరమ్మతులు, కొత్త పరికరాల ఏర్పాటు తదితర పనులతో కొన్ని నెలలపాటు పూల్‌ను తెరవలేదని పేర్కొన్నారు. ఏరియా జీఎం దేవేందర్ ఆదేశాల మేరకు తిరిగి ప్రారంభించామని తెలిపారు.

## 15 నుంచి 17 వరకు యోగా శిక్షణ

**రెబ్బెన(ఆసిఫాబాద్):** బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో హార్ట్ ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్, భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సింగరేణి, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 17 వరకు మాస్ యోగా, ధ్యానం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జీఎం దేవేందర్ తెలిపారు. ప్రత్యేక ఆసనాలు, ప్రాణాయామం, ముద్రలు, ధ్యానం కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఉచిత శిక్షణలో పాల్గొనాలని సూచించారు.

# కల్లాల కథ కంచికేనా..?

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా వరి కోతలు పూర్తి చేసినవారు ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నేలపై ఆరబోయడంతో వరద నీరు నిలిచి ధాన్యం మొలకలు వచ్చిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ కల్లాల అవశ్యకత మరోసారి చర్చనీయాంశంగా మారింది.

- ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో కనిపించని వ్యవసాయ కల్లాల ఆప్షన్
- అకాల వర్షాలతో రైతుల్లో ఆందోళన
- వ్యవసాయ ఉత్పత్తులు ఆరబెట్టేందుకు తప్పని తిప్పలు



కల్లం లేక నేలపై ఆరబోసిన వరి ధాన్యం

**రెబ్బెన(ఆసిఫాబాద్):** ఆరుగాలం కష్టపడి రైతులు పండించి పంటను ఆరబెట్టేందుకు కల్లాల ఆవశ్యకత ఎంతో ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈజీఎస్ నిధులతో సబ్సిడీ అందించి కల్లాల నిర్మాణానికి రైతులను ప్రోత్సహించింది. ప్రారంభంలో అన్నదాతలు ఆసక్తి చూపకపోయినా.. ఆ తర్వాత అవసరాల దృష్ట్యా అనేక మంది ముందుకొచ్చారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్‌లో తెచ్చిన సంస్కరణలతో ×కల్లాల కథ₹ కంచికి చేరినట్లైంది. కొత్త సాఫ్ట్‌వేర్‌లో వీటి నిర్మాణ అంశమే లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఈజీఎస్ నిధులను కల్లాల నిర్మాణం పేరిట పక్కదారి పట్టించిందని, వాటిని తిరిగి చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడంతో జిల్లాలో వివిధ దశల్లో ఉన్న కల్లాల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై స్పష్టతనివ్వకపోవడంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

**ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో కనిపించని ఆప్షన్**

వరి,, కంది, పెసర, సోయా వంటి పంటలను ఆరబెట్టేందుకు కల్లాలు తప్పనిసరి. గతంలో రైతులు పొలాల్లోనే ఖాళీ ప్రదేశాన్ని చదును చేసి నేలపై పంటలు ఆరబెట్టుకునేవారు. కొంత ధాన్యం మట్టిలో కలిసిపోయి నష్టపోయేవారు. దీనికితోడు అకాల వర్షాలు కురిసిన ప్రతిసారి ధాన్యం తడిసి ముద్దయ్యేది. ఈ పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ నిధులతో కల్లాలు మంజూరు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఈజీఎస్ సిబ్బంది 1,503 కల్లాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం 1,463 కల్లాలను మంజూరు చేసింది. వాటిలో కేవలం 382 కల్లాలు మాత్రమే పూర్తి కాగా, ఇంకా 693 కల్లాలు వివిధ దశల్లోనే మిగిలిపోయాయి. గతేడాది కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీలో తీసుకువచ్చిన ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో కల్లాల నిర్మాణ పనులకు సంబంధించి ఎలాంటి ఆప్షన్ ఇవ్వలేదు. సొంత ఖర్చులతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికే ప్రభుత్వం డబ్బులు చెల్లించింది. వివిధ దశల్లో ఉన్న వాటికి ఇప్పటివరకు రూపాయి చెల్లించలేదు.

**రైతులకు పాట్లు**

ప్రస్తుతం జిల్లాలో వరికోతలు ఊపందుకున్నాయి. కొనుగోళ్లు సైతం ప్రారంభమయ్యాయి. ధాన్యంలో ప్రభుత్వం నిర్ణయించిన తేమశాతం వచ్చే వరకు తప్పనిసరిగా ఆరబెట్టాల్సి ఉంటుంది. ఖాళీ ప్రదేశాల్లో ఆరబోసిన ధాన్యం అకాల వర్షాలతో తడిసిపోతుండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రంగు మారిన, నాణ్యత దెబ్బతిన్న ధాన్యాన్ని కొనేందుకు మిల్లర్లు మొగ్గుచూపకపోవటంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. రైతులు ముందుకొస్తున్నా కొత్త సాఫ్ట్‌వేర్‌లో కల్లాల నిర్మాణాలకు సంబంధించిన ఎలాంటి ఆప్షన్లు లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

### కల్లం లేక నేలపైనే..



వ్యవసాయం చేసే ప్రతీ రైతుకు కల్లం ఎంతో అవసరం. సరైన స్థలం లేక నేలపైనే వరి, కంది పంటలు ఆరపెడుతున్నాం. కొంత వరి, కంది మట్టిలో కలిసిపోతున్నాయి. అనుకోకుండా వర్షం వస్తే మొలకలు వస్తుంటాయి.

– వసంత్‌రావు, రైతు, రెబ్బెన

### ప్రభుత్వాలే నిర్మించాలి



వ్యవసాయ రంగంలో కల్లాల అవసరం ఎంతో ఉంటుంది. అలాంటి వాటిని ప్రభుత్వాలే పూర్తి ఖర్చును భరించి రైతులకు నిర్మించి ఇవ్వాలి. పంట ఉత్పత్తులు ఆరబెట్టుకునేందుకు వసతులు లేకపోవడంతో జిల్లాలోని రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

– రాయిల్ల నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

## క్లుప్తంగా

### పని ప్రదేశంలో ఉపాధి కూలీ మృతి


లచ్చు(ఫైల్)

చెన్నూర్‌రూరల్‌: ఉపాధి హామీ పనులు చేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురై కూలీ మృతి చెందిన సంఘటన చెన్నూర్ మండలంలోని కన్నెపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మొగిలి లచ్చు((52) గ్రామ సమీపంలో జరుగుతున్న కుంట పూడిక తీత పనులకు వెళ్లింది. మిగతా వారితో కలిసి పనులు చేస్తుండగా ఒక్కసారిగా పని ప్రదేశంలో కుప్పకూలింది. దీంతో ఆందోళనకు గురైన తోటి కూలీలు వెంటనే గ్రామానికి తీసుకువచ్చారు. లచ్చు ఇంటికి చేరుకొనే లోపే ప్రాణాలు విడిచింది. ఎండ తీవ్రత కారణంగానే అస్వస్థతకు గురై మృతి చెందిందని స్థానికులు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో గంగాభవాని గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా రూ.2లక్షల బీమా పరిహారం వచ్చేలా కృషి చేస్తామని వారు తెలిపారు.

### సీనియర్ కార్మికులకు అవకాశం కల్పించాలి


మాట్లాడుతున్న బ్రాంచి కార్యదర్శి తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): సర్ఫేస్ జనరల్ మజ్దూర్ కోసం దరఖాస్తు చేసుకునే కార్మికులకు బేసిక్ తగ్గకుండా సీనియర్ కార్మికులకు అవకాశం కల్పించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియాకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌గా సింగరేణి వ్యాప్తంగా కార్మికులను దరఖాస్తులు తీసుకోగా అందులో నుంచి కేవలం 96 మందికి అవకాశం కల్పించిందన్నారు. బేసిక్ తగ్గకుండా సీనియర్ కార్మికులకు అవకాశం కల్పించాల్సి ఉండగా దానిని తుంగలో తొక్కిన యాజమాన్యం ఏ క్యాటగిరిలోనైనా పనిచేసేలా నిబంధనలు పెట్టి దరఖాస్తులు తీసుకోవడం అన్యాయమన్నారు. దీంతో ఒక్కో కార్మికుడు రూ.15 నుంచి 20వేల వరకు నష్టపోవాల్సి వస్తోందన్నారు. సమావేశంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శేషు, మారం శ్రీనివాస్, నాయకులు రాజేష్ పాల్గొన్నారు.

# పరీక్ష ఫలితమే.. జీవితం కాదు




- మార్కులు, ర్యాంకులే కొలమానం కాదు..
- ప్రముఖులెందరో చదువుల్లో పరాజితులే
- కఠిన నిర్ణయాలు సబబు కాదంటున్న మానసిక నిపుణులు

నిర్మల్‌ఖిల్లా: జీవితం అంటే చదువులు, మార్కులు, ర్యాంకులు, ఉన్నత ఉద్యోగాలు మాత్రమే కాదు. ఇవన్నీ విజయానికి కొలమానాలు కానేకాదు. మరి ఎందుకు చదువుకోవాలి.. దాని పరమార్థం ఏమిటి? మన జీవితంలో చదువు, కెరీర్‌ల పాత్ర ఏమిటి? గొప్పగొప్ప వాళ్లంతా పెద్దపెద్ద చదువులు చదివినవాళ్లేనా? ... పలు పరీక్షా ఫలితాల నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

**ఒత్తిడే కారణం..**

ఇంటర్, పదో తరగతి, నీట్, ఎంసెట్, ఐఐటీ, పోటీ పరీక్షలు ఏవైనా ఫలితాల సమయంలో ఒత్తిడి సహజం. వీటి ప్రభావంతో తీసుకున్న కఠిన నిర్ణయాలైన ఆత్మహత్యలు అప్పుడప్పుడూ తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. పదో తరగతి, ఇంటర్ ఇతర ప్రవేశ పరీక్షల్లో ఫెయిల్యూర్‌ను విద్యార్థులు భరించలేకపోవడం దీనికి ముఖ్యకారణం. ఇంటి నుంచే కాకుండా.. సమాజం నుంచి కూడా వచ్చే ఒత్తిడి దీనికి కారణమని మానసిక నిపుణులు అంటున్నారు.

**చదువు తెలివితేటల కోసమే..**

తల్లిదండ్రులు తిడతారని ఒకరు.. స్నేహితుల వద్ద తలెత్తుకులేమని ఇంకొకరు.. సమాజంలో పరువు పోతుందని మరొకరు.. ఇలా ఏదో కారణంతో విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. చదువులో వెనకబడి ఉండి కూడా జీవింతంలో ఊహించని సక్సెస్ అందుకున్న వాళ్లు కోకొల్లలు. డిగ్రీ పట్టా లేకపోయినా వివిధ రంగాల్లో అసమాన్య ప్రతిభ కనబర్చినవారు బోలెడుమంది ఉన్నారు. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయితే అదేం జీవితంలో ఫెయిల్ అయినట్టు కాదు. విద్యార్థులకు మరో అవకాశం ఉంటుంది. సప్లిమెంటరీలు రాసి మళ్లీ పాస్ కావచ్చు. క్రీడలు, సినిమా, బిజినెస్ లాంటి పలురంగాల్లో అవకాశాలు చాలా ఉన్నాయి. చదువు నిన్ను అవగాహన పరంగా మరో మెట్టు ఎక్కించడానికి మాత్రమే. చదువులో ఫెయిల్ అయితే బతుకులో ఫెయిల్ అయినట్టు కాదు. సరిగ్గా అనుకుంటే చులకనగా చేసిన సమాజం ముందే తలెత్తుకొని జీవించవచ్చు. వివిధ రంగాల్లో ఉన్నతంగా ఎదిగిన అలాంటి వ్యక్తుల ఉదాహరణలు మచ్చుకు కొన్ని....

### కమల్‌హాసన్.. సినీనటుడు



నటనలో యావత్ భారతాన్ని ఒక్క ఊపు ఊపిన వారిలో కమల్‌హాసన్ ఒకరు. ఆయన చిన్నప్పుడు స్కూల్ డ్రాప్ అవుట్. పదో తరగతి కూడా చదవలేదు. అయితే నేం నాలుగు దక్షిణ భారత భాషల్లో అనర్గళంగా మాట్లాడటం, రాయటం, చదవడంపై పట్టుసాధించాడు. కమల్‌హాసన్ నటుడు మాత్రమేకాదు రచయిత, డైరెక్టర్, ప్రొడ్యుసర్, ప్లేబ్యాక్ సింగర్.. మల్టీటాలెంటెడ్ స్టార్‌గా ఎదిగాడు.

### మహేంద్రసింగ్ ధోని.. క్రికెట్ ఆటగాడు



మనదేశ ప్రఖ్యాత క్రికెటర్లలో ఒకరైన మహేంద్ర సింగ్ ధోనికి తన చిన్నతనంలో చదువు పట్ల పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. చిన్నప్పుడు బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ ఆటలు ఆడేవాడు. ధోనీ గోల్ కీపర్‌గా ఫుట్‌బాల్ ఆడుతున్నప్పుడు, అతడి కోచ్ అతడిని స్థానిక క్రికెట్ క్లబ్‌లో వికెట్ కీపర్‌గా ఆడటానికి ఎంపిక చేశాడు. కాలక్రమేణా క్రికెట్ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన ధోని కుటుంబాన్ని పోషించుకోవడానికి రైలు టిక్కెట్ ఎగ్జామినర్‌గా పనిచేశాడు. 2004లో భారత క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎదిగి ఎన్నో రికార్డులను సాధించాడు.

### క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దు



క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు. స్థిరంగా ఆలోచించుకోవాలి. మార్కులు, ర్యాంకులు కొలమానం కాదు. చదువుల్లో రాణించని ఎందరో ప్రముఖులు తాము ఎంచుకున్న ప్రత్యామ్నాయ రంగాల్లో ఉన్నతంగా ఎదిగిన వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలి. మానసికంగా దృఢంగా ఉండేలా విద్యార్థులు, యువతకు తల్లిదండ్రులే మార్గనిర్దేశనం చేయాలి. - మోత్కూరి రాంచందర్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

### ఎంతోమంది..


వ్యాపార వేత్త సుభాష్ చంద్ర గోయెంకా

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ఎంటర్‌ప్రెన్యూర్ నారాయణ మూర్తి, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఎయిర్ డెక్కన్ కెప్టెన్ గోపినాథ్, వరల్డ్ చాంపియన్ సుశీల్ వ్యాపార వేత్త సుభాష్‌చంద్ర గోయెంకా వీరందరి ప్రయాణం ఉన్నత చదువులతో ప్రారంభం అవ్వలేదు. అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎన్నో ఒడిదుడుకులు, అవమానాలను ఎదుర్కొని కష్టపడి ఎదిగినవాళ్లు. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని, పదిలో ఫెయిల్ అయ్యారని తనువు చాలించాలనే నిర్ణయానికి రావడం సబబేనా.. ఓ సారి ఆలోచించండి..

### ఆత్మవిశ్వాసం ఉంటే చాలు...



దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామానికి చెందిన డాక్టర్ వెల్మల మధు ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వేలాది మంది పోటీ పడిన డీఎల్ పరీక్షలో ఆయన ఎందర్నో వెనక్కినెట్టి ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయన ఒకప్పుడు ఇంటర్‌లో పరీక్ష తప్పాడు. డిగ్రీలోనూ అంతే ముందుకెళ్లలేకపోయాడు. తనవల్ల కాదని ప్రయివేటులో చిన్నాచితక ఉద్యోగాలు చేస్తూ పోయాడు. కొన్నేళ్ల తర్వాత తనమిత్రులను చూసి స్ఫూర్తిని పొందాడు. ఆగిన చదువును పట్టాలెక్కించి డిగ్రీ నుంచి వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందేదాకా ఎక్కడా వెనుదిరిగి చూడలేదు. ప్రస్తుతం వివిధ అంశాలలో ప్రావీణ్యం సంపాదించి అనేక పరిశోధన పత్రాలను, అంతర్జాతీయ స్థాయిలో సమర్పిస్తూ రాణిస్తున్నారు.

# ఇంటర్ ఫలితాల్లో గురుకులాల హవా

- ఫస్టియర్‌లో 2వ, సెకండియర్‌లో 4, 5వ ర్యాంక్‌లు
- విద్యార్థినులను అభినందించిన ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి



రాష్ట్ర వ్యాప్తంగా 4వ ర్యాంక్ సాధించిన టి.వర్షిత


రాష్ట్ర వ్యాప్తంగా 5వ ర్యాంకు సాధించిన సీహెచ్ సుధారాణి

ఉట్నూర్‌రూరల్‌: తెలంగాణ గిరిజన గురుకులాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని 13కళాశాలల్లో 95.27శాతం, మొదటి సంవత్సరంలో 85.12శాతం ఫలితాలు సాధించినట్లు ఆర్సీవో గంగాధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ సెకండ్ ఇయర్ సీఈసీలో టి.వర్షిత (ఉట్నూర్ కళాశాల) 946 మార్కులు, సీహెచ్ సుధారాణి (ఆసిఫాబాద్ కళాశాల) 945 మార్కులతో రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో 4వ, 5వ ర్యాంక్‌ను సాధించినట్లు తెలిపారు. అలాగే ఆసిఫాబాద్ గురుకులానికి చెందిన ఆర్.కార్తీక 458 మార్కులతో బైపీసీలో రాష్ట్రంలోనే 2వ ర్యాంక్‌ను సాధించినట్లు తెలిపాడు. సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఇంద్రవెల్లి, తిర్యాణి, ఆసిఫాబాద్, జైనూర్ బాలికల జూనియర్ కళాశాల 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 1117 మందికి 1068 మంది ఉత్తీర్ణత సాధించగా 49 మంది ఫెయిలైనట్లు తెలిపాడు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 1279 మందికి 1104 మంది ఉత్తీర్ణులు కాగా 175 మంది అనుత్తీర్ణులైనట్లు పేర్కొన్నాడు. గురుకుల జూనియర్ కళాశాలల్లో సెకండ్ ఇయర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 4, 5వ ర్యాంక్ సాధించిన వర్షిత, సీహెచ్ సుధారాణి, 2వ ర్యాంకు సాధించిన ఆర్.కార్తీకను ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి, ఆర్సీవో గంగాధర్ అభినందించారు.

# చేపల చెరువులో విషప్రయోగం?


చనిపోయిన చేపలను ట్రాక్టర్లలో వేస్తున్న స్థానికులు


చెరువులో చనిపోయిన చేపలు

కోటపల్లి: మండలంలోని ఆలుగామ చేపల చెరువులో సుమారు 3వేల చేపలు ఒకేసారి మృతి చెందినట్లు రైతు చిన్నన్న వాపోయాడు. బాధితుల వివరాల ప్రకారం... ఆలుగామ గ్రామానికి చెందిన రాంటెంకి చిన్నన్న తనకున్న భూమిలో మూడేళ్ల క్రితం సుమారు రూ.4వేల చేపలను చెరువులో వేసి పెంపకం చేస్తున్నాడు. మంగళవారం ఉదయం చేపలు పట్టడానికి చెరువుకు వెళ్లి చూడగా చేపలు చనిపోయి బయటికి తెలి కనిపించాయి. చేపలు ఒక్కసారిగా మరణించిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లగా ఎస్సై వెంకట్ చేరుకుని పరిశీలించాడు. చేపల చెరువులో విషప్రయోగం చేశారా? లేక ఏదైనా వ్యాధి సోకి చనిపోయాయా అనేది విచారణలో తేలాల్సి ఉంది. చేపల మృతితో సుమారు రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు రాంటెంకి చిన్నన్న వాపోతున్నాడు.

### 15న జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 15న శుక్రవారం మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి కౌశిక వెంకటరమణ తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకులో ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల వయస్సు 26ఏళ్లలోపు వారై ఉండాలని, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు తెలంగాణలో ఎక్కడైనా పని చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్ నం. 9111731173, 6304600392 సంప్రదించాలన్నారు.

# గాలి దుమారానికి కూలిన ఇళ్లు


కూలిన ఇంటి ఎదుట బాధిత కుటుంబం

నెన్నెల: మండలంలోని మైలారం గ్రామంలో మంగళవారం భారీ గాలి దుమారానికి గిరిజన కుటుంబానికి చెందిన ఎడ్ల మల్లేష్‌కు చెందిన పెంకుటిళ్లు కూలి నేలమట్టమైంది. రెక్కాడితే కాని డొక్కాడని తమ బతుకులు ఇలా ఆగమయ్యాయని బాధిత కుటుంబం వాపోయింది. సామగ్రి మొత్తం చెడిపోవడంతో సుమారు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

# లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం


మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి రమేష్‌కుమార్

బెల్లంపల్లిరూరల్‌: రెండో విడత గొర్రెల పంపిణీకి ఎంపికైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామంలో రెండో విడత గొర్రెల పంపిణీపై లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా డీడీలు చెల్లించాలని సూచించారు. డీడీలు, ధృవీకరణ పత్రాలు మండల పశు వైద్యాధికారులకు అందించాలని తెలిపారు. మేలైన గొర్రెల సంతతిని పంపిణీ చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. గొర్రెల కొనుగోలు కోసం మహారాష్ట్రలోని షోలాపూర్, ఆంధ్రప్రదేశ్‌లోని కడప, ప్రకాశం, కర్ణాటకలోని బళ్లారి, కొప్పాల్‌లను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ గొల్లకుర్మలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేపట్టిందన్నారు. ఈ పథకాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీటీసీ సుభాష్‌రావు, ఎంపీడీవో రాజేందర్, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు శంకర్, పశువైద్యాధికారి సుజాత పాల్గొన్నారు.

# ఆరోగ్య మహిళా కేంద్రాల్లో పూర్తి సేవలు

- జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు


వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్‌: జిల్లాలో ఏర్పాట చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ బస్తీద వాఖానాలో మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రంకు వచ్చిన మహిళలు, అక్కడి వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌వో మాట్లాడారు. ఉదయం 9 గంటల్లోపే ఆరోగ్య మహిళా క్లినిక్‌లను తెరవాలని సూచించారు. ల్యాబ్‌లో వైద్య పరీక్షలకు సంబంధించి ముందస్తుగానే సరిపడా కిట్స్‌ను సమకూర్చుకోవాలని, అవసరమైన మందులను అందించాలని తెలిపారు. మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, డీపీవో ప్రశాంతి పాల్గొన్నారు.

**మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసమే..**

బెల్లంపల్లిరూరల్‌: మహిళల సంపూర్ణ ఆరోగ్య కోసమే వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మహిళా (క్లీనిక్)క్యాంపులను ఏర్పాటు చేయడం జరుగుతుందని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు అన్నారు. బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించి ఆరోగ్య మహిళా(క్లీనిక్) క్యాంపును ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. డెప్యూటీ డీఎంహెచ్‌వో విజయపూర్ణిమ క్లినిక్‌ను సందర్శించారు. డీపీవో ప్రశాంతి, తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎవంజలీన్, అనిష్, సమ్మయ్య ఉన్నారు.

### తాళంవేసి ఉన్న ఇంట్లో పట్టపగలు చోరీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని హన్మాన్‌బస్తీలో మంగళవారం మాడుప హరీష్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరికి పాల్పడ్డారు. వన్‌టౌన్ ఎస్సై విక్టర్ వివరాల ప్రకారం... హరీష్ భార్య పక్షం రోజుల క్రితం తల్లిగారింటికి వెళ్లింది. అప్పటి నుంచి హరీష్ ఇంటి వెనకాల వీధిలో నివాసం ఉంటున్న తల్లిదండ్రులు వద్దకు వెళ్లి మధ్యాహ్నం భోజనం చేసి రాత్రి తన ఇంట్లో పడుకుంటున్నాడు. ఎప్పటి మాదిరిగానే ఉదయం 11గంటలకు ఇంటికి తాళం వేసిన హరీష్ తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చి తాళం తీయగా తలుపులు తెరుచుకోలేదు. అనుమానం వచ్చి గోడ దూకి ఇంటి వెనకాలకు వెళ్లి పరిశీలించగా బీరువాలోని రూ.1.50లక్షల నగదు, మూడు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.